సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



వందేహం గణనాయకం

ప్రశాంతి నిలయంలో మంగళవారం వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. 8లో



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4.50, సరాసరిన రూ.6.50 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.3°/22.1°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.



పుట్టపర్తిలోని కుమ్మరిపేటలో నాగపడగపై కొలువుదీరిన వినాయకుడు



విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎస్పీ మాధవ రెడ్డి దంపతులు



అమరాపురంలో మంటపం వద్ద యువత సందడి





తాడిమర్రిలో నందిపై గజాననుడు, కదిరిలో మూషికాల రథంపై గణనాథుడు



హిందూపురంలో ఆంజనేయ గణేశుడు

హేయ్.. హేయ్ గణేశా

పుట్టపర్తి టౌన్: జిల్లాలో వినాయక చవితి సందడి కొనసాగుతోంది. అన్ని ప్రాంతాల్లో పండుగ కోలాహలం నెలకొంది. పల్లె మొదలు పట్నం దాకా అందంగా అలంకరించిన మంటపాల్లో లంబోదరుడు సోమవారం కొలువుదీరాడు. ప్రత్యేక పూజలందుకున్నాడు. పలు చోట్ల విభిన్న ఆకృతుల్లో గణేశుడు ఆకట్టుకున్నాడు. మంటపాల ఎదుట యువత సందడి చేశారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో పిండి వంటలు సమర్పించారు.

జిల్లావాసులపై స్వామి ఆశీస్సులుండాలి..

వినాయక చవితిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో వినాయకుడు కొలువుదీరాడు. సోమవారం ఉదయం ఎస్పీ మాధవరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. జిల్లా ప్రజలందరిపై విఘ్నవినాయకుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐ నారాయణ, సీఐ కొండారెడ్డి, సీసీ రాఘవేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నిమజ్జనానికి భద్రత కట్టుదిట్టం

- ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: వినాయక విగ్రహాల నిమజ్జనం రోజున భద్రత కట్టుదిట్టం చేస్తున్నట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,380 విగ్రహాలు ఏర్పాటు చేయగా, ఇప్పటికే 1,500 విగ్రహాలు నిమజ్జనం చేశారన్నారు. బుధవారం మిగిలినవి గంగమ్మ ఒడికి చేరతాయన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే వినాయక ఉత్సవ కమిటీలతో సమావేశాలు నిర్వహించి తగిన సూచనలు చేశామన్నారు. నిబంధనల మేరకు కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. డీజే సౌండ్ ఎక్కువగా చేయకుండా, ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించరాదని సూచించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు మెగా జాబ్ మేళా



హిందూపురం టౌన్: హిందూపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూమ్, కళాశాల ప్రిన్సిపాల్ హరీష్ తెలిపారు. టెలీ పెర్ఫామెన్స్, ఏటీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం ఇస్తారన్నారు. పెనుకొండ, హైదరాబాద్‌లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకుని ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు ఫోన్ నంబర్ 9492051475ను సంప్రదించాలని కోరారు.

బెటాలియన్ కమాండెంట్ బాధ్యతల స్వీకరణ



బుక్కరాయసముద్రం: జంతలూరు వద్దనున్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్‌గా గంగాధర్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న జగదీష్ తూర్పు గోదావరి ఎస్పీగా బదిలీపై వెళ్లారు. అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న గంగాధర్‌రావు బదిలీపై ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌కు కమాండెంట్‌గా వచ్చారు. అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, సిబ్బంది కమాండెంట్‌కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కమాండెంట్ గంగాధర్‌రావు మాట్లాడుతూ బెటాలియన్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

24న జిల్లా స్థాయి యోగా పోటీలు


అనంతపురం: ఈ నెల 24న ఉమ్మడి జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజశేఖరరెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని రెవెన్యూ కాలనీలో ఉన్న వివేకానంద భవన్‌లో జరిగే పోటీల్లో 9 నుంచి 55 సంవత్సరాల వయసున్న వారు పాల్గొనవచ్చు. వయసును బట్టి మొత్తం ఆరు విభాగాలుగా పోటీలను నిర్వహించనున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 24వ తేదీ ఉదయం 8 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఈఎన్ మారుతీ ప్రసాద్, శ్రీనివాసులు తెలిపారు.

‘పెను’ సోయగాల ‘కొండ’

- ఆకట్టుకునే విశేషాలతో అలరారుతున్న పెనుకొండ
- ఎన్నో ఏళ్ల చరిత్రకు నెలవు
- పర్యాటక ప్రదేశాల కొలువు
- అభివృద్ధిపై గత ప్రభుత్వాల నిర్లక్ష్యం
- వైఎస్సార్ సీపీ హయాంలో పునర్వైభవం

సాక్షి, పుట్టపర్తి:

కొండల నడుమ కొలువై... చుట్టూ పర్యాటక ప్రదేశాలకు నెలవై.. సుదీర్ఘ చరిత్రకు దర్పణమై.. చెప్పుకుంటూ పోతే ఎన్నో విశేషాల సమాహారమై.. అలరారుతోంది పెనుకొండ పట్టణం. విజయనగర సామ్రాజ్య రాజసం ఉట్టిపడే పెనుకొండకు నేడు నిత్యం వందలమంది పర్యాటకులు వచ్చి పోతున్నారు. దీంతో ఇక్కడి ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్లు నిత్యం సందడిగా ఉంటున్నాయి.



పెనుకొండ కోటకు వెళ్లే దారి



జాతీయ రహదారి వద్ద శ్రీకృష్ణదేవరాయల విగ్రహం

చరిత్ర పుటల్లో..

పెనుకొండ పట్టణానికి ప్రాచీన చరిత్ర ఉంది. ఇక్కడి కోటపై ఎంతో ప్రాముఖ్యత కలిగిన దేవాలయం ఉంది. తొలుత జైనులు పాలించినట్లుగా ఆధారాలు లభించాయి. ఆ తర్వాత విజయనగర సామ్రాజ్యానికి చెందిన శ్రీ కృష్ణదేవరాయలు పరిపాలించారు. పెనుకొండ విజయనగర రెండో రాజధానిగా వెలుగొందింది. ఒకప్పుడు ఇక్కడ 365 దేవాలయాలు ఉండేవని చెబుతారు. దీంతో అప్పట్లోనే ఇక్కడికి పెద్ద ఎత్తున భక్తులు, పర్యాటకులు వచ్చి వెళ్లేవారు. ప్రస్తుతం మాత్రం షేర్ ఖాన్ మసీదు, జామియా మసీదు, పాంచ్ బీబీ దర్గా, బాబయ్యకొండ (ఛిల్లాపహడ్), గగన మహల్, గాలి గోపురం, తిమ్మరుసు బందీఖానా, కుంభకర్ణ విగ్రహం, కాశేశ్వరస్వామి ఆశ్రమం, అజితనాథ ఆలయాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. జిల్లాలోని అన్ని పట్టణాల నుంచి పెనుకొండకు ఆర్టీసీ బస్సు సర్వీసులున్నాయి. అన్ని రైళ్లూ ఇక్కడి స్టేషన్‌లో ఆగుతాయి.

కొండలు దాటాల్సిందే..

పెనుకొండ నుంచి ఎటు వైపు వెళ్లినా కొండలు దాటాల్సిందే. మడకశిరకు వెళ్లాలంటే మావుటూరు మార్గంలో ఘాట్ సెక్షన్ ఉంటుంది. పావగడ వైపు వెళ్లాలన్నా అదే పరిస్థితి. సోమందేపల్లి వెళ్లాలన్నా.. మధ్యలో జాతీయ రహదారిపై చిన్న చిన్న గుట్టలు వస్తాయి. అదేవిధంగా కొత్తచెరువు వైపు వెళ్లాలంటే జాతీయ రహదారి పక్కనే కొండలు కనిపిస్తాయి. ఫలితంగా దగ్గరికి వెళ్లే వరకూ పట్టణం కనిపించదు. ఏరియల్ వ్యూలో మాత్రమే పూర్తిగా చూసే అవకాశం ఉంటుంది. అటవీ ప్రాంతం అధికంగా ఉండటంతో జంతువులు ఎక్కువగా ఉంటాయి. దీనికి తోడు కొండపైకి ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయడంతో పర్యాటకులు వెళ్లి వస్తుంటారు.

అభివృద్ధిపై గత ప్రభుత్వాల నిర్లక్ష్యం..

ప్రసిద్ధిగాంచిన పెనుకొండ పట్టణ అభివృద్ధిపై గత ప్రభుత్వాలు దృష్టి సారించలేదు. మౌలిక వసతులు కొరవడడంతో పర్యాటకులు కూడా వచ్చేవారు కాదు. అయితే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రగతి పనులు పరుగులు తీస్తున్నాయి. రూ.కోట్లు వెచ్చించి కొండపైకి రోడ్లు వేశారు. కొండపై లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నిర్మించారు. రోప్‌వే నిర్మాణానికి కూడా ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. సర్కారు చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పర్యాటకులను ఆకట్టుకునేలా ఏర్పాటు చేసిన పెనుకొండ ముఖద్వారం



విజయనగర వైభవానికి అద్దం పట్టే గగనమహల్

పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి



పెనుకొండ చుట్టూ కొండలతో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. అందుకే కృష్ణదేవరాయలు రెండో రాజధానిగా చేసుకొని వేసవి కాలంలో పరిపాలన సాగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొండపైకి రూ.కోట్లు వెచ్చించి రోడ్లను వేశారు. పర్యాటకంగా అభివృద్ధి చెందడానికి ఈ చర్యలు నాంది.

– నారాయణ, రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్, పెనుకొండ

మరిన్ని వసతులు కల్పించాలి



శ్రీకృష్ణదేవరాయల పాలన తరహాలో ప్రస్తుతం పెనుకొండ అభివృద్ధి చెందుతోంది. గత ప్రభుత్వాల కంటే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పెనుకొండలోని కోట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. కొండపై లక్ష్మీనరసింహస్వామి ఆలయం నిర్మించింది. తాగునీరు, వసతి సౌకర్యం కల్పిస్తే కొందరికి ఉపాధి లభిస్తుంది.

– సుబ్బయ్య, రిటైర్డ్ హాస్టల్ వార్డెన్, పెనుకొండ

అభివృద్ధి పరుగులు



కృష్ణదేవరాయల రెండో రాజధానిగా విరాజిల్లిన పెనుకొండ ప్రస్తుతం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోంది. ఇప్పటికే కొండపైకి రోడ్డు నిర్మించారు. అదేవిధంగా రోప్‌వే నిర్మాణానికి కూడా ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన క్రమంలో పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందనుంది. పర్యాటకుల రద్దీకి అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తే మరింత బాగుంటుంది.

– ఎంఎస్ మూర్తి, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు

డిగ్రీ ఇన్‌స్టంట్ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, తదితరులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాలను మంగళవారం ఆ వర్సిటీ వీసీ ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి విడుదల చేశారు. మొత్తం 158 మంది ఇన్‌స్టంట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, హాజరైన 157 మంది కూడా ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. డిగ్రీలో ఒక సబ్జెక్టు మినహా అన్ని సబ్జెక్టులూ ఉత్తీర్ణత చెందిన 5, 6వ సెమిస్టర్‌కు చెందిన విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్ష రాసే అవకాశం కల్పించినట్లు ఈ సందర్భంగా వీసీ పేర్కొన్నారు. ఈ నెల 15న పరీక్ష నిర్వహించి కేవలం 48 గంటల్లోనే ఫలితాలు విడుదల చేసిన పరీక్షల విభాగం అధికారులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములు నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రాయుడు, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఏ రెండో సెమిస్టర్ ఫలితాలు..

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నిర్వహించిన ఎంసీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ ఫలితాలు మంగళవారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ విడుదల చేశారు. పరీక్షలు ఈ నెల 13న ముగిశాయి. కేవలం ఆరు రోజుల వ్యవధిలోనే ఫలితాలు విడుదల కావడం గమనార్హం. ఫలితాలను విద్యార్థులు ఆ కళాశాల అకడమిక్ సెక్షన్‌ను అడిగి తెలుసుకోవచ్చు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్‌రెడ్డి, హెచ్‌ఓడీలు ప్రొఫెసర్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ కె.కళ్యాణిరాధ, డాక్టర్ బి.దిలీప్‌కుమార్, బి.అజిత, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.విష్ణువర్ధన్, డాక్టర్ డి.లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ అరుణ్‌బాబు
- ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డితో కలిసి సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరం చేయాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితో కలిసి ఇళ్ల నిర్మాణాల పురోగతి, బిల్లుల చెల్లింపుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రతి ఇంటినీ ఆర్‌సీ స్థాయికి తీసుకురావాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. నల్లమాడ మండలంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులతో మమేకమవ్వాలన్నారు. నిర్మాణాల్లో పురోగతి సాధించాలన్నారు. నియోజకవర్గాన్ని రూ. వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతి పేదవాడి కల సాకారం చేద్దామని పిలుపునిచ్చారు. నిరుపేదలను గుర్తించడం, మ్యాపింగ్, రిజిస్ట్రేషన్, జియో ట్యాగింగ్, బిల్లులు అప్‌లోడ్ చేసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లో తిరిగి నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నాగరాజు, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, ఆరు మండలాల హౌసింగ్ ఏఈలు ఉన్నారు.

గడువులోపు లక్ష్యాలు చేరుకోవాలి

గడువులోపు లక్ష్యాలు చేరుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో డీఆర్‌ఓ కొండయ్య, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావుతో కలిసి వ్యవసాయ శాఖ, జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం, స్పందన, నాడు–నేడు , హౌసింగ్, ప్రాధాన్యతా భవనాల నిర్మాణం, స్వమిత్వ, సచివాలయాలు, ఐసీడీఎస్‌పై ఆయన సమీక్షించారు. సుమారు 3 గంటల పాటు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పీఎం కిసాన్- ఆధార్ ఈకేవైసీ ప్రక్రియ వేగం పెరగాలన్నారు. పూర్తయిన సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లను ఆయా శాఖలకు అప్పగించాలన్నారు. ఈ నెల 30న షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యం అందించాలన్నారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని పలువురు ఎంపీడీఓలు, సీడీపీఓలు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. రికార్డుల పరిశీలన, తనిఖీల విషయంలో బత్తలపల్లి, సోమందేపల్లి సీడీపీఓల పనితీరు మెరుగుపడాలని, ఇద్దరికీ ఇదే చివరి హెచ్చరిక అని కలెక్టర్ స్పష్టం చేశారు.

పక్కాగా ఓటరు జాబితా

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటిస్తూ పకడ్బందీగా ఓటర్ల జాబితా రూపొందిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వర్చువల్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు ఇన్‌చార్జ్ జేసీ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓలు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకుల నుంచి 46,869 ఫిర్యాదులు అందాయన్నారు. 7,985 డెత్ కేసుల పరిశీలన పూర్తయిందన్నారు. అప్ డేట్ ప్రక్రియను నెలాఖరులోపు పూర్తి చేస్తామన్నారు. బుధవారం అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామని, 22న తుది జాబితాను ఎన్నికల కమిషన్‌కు సమర్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు గోరంట్లలో 'జగనన్నకు చెబుదాం'

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు గోరంట్లలో బుధవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. వైకేపీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, పరిష్కరిస్తామన్నారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొంటారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తితో ఓ యువకుడు, మరో వివాహిత బలవన్మరణానికి పాల్పడగా... అప్పులు తీర్చేందుకు తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని చూసి మనస్తాపంతో మరో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు...

- **పరిగి:** మండలంలోని ఎర్రగుంటకు చెందిన శివయ్య (35), సరస్వతి దంపతులకు ఇద్దరు సంతానం. పరిగిలోని ఓ గార్మెంట్స్ పరిశ్రమలో శివయ్య పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్న ఆయన.. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.
- **హిందూపురం అర్బన్:** స్థానిక ఆటోనగర్‌లో నివాసముంటున్న సయ్యద్, యాస్మిన్ (35) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. సయ్యద్ జేసీబీ మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల గృహ నిర్మాణానికి అప్పులు చేశారు. ఈ అప్పులు తీర్చే విషయంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మనస్తాపం చెందిన యాస్మిన్ సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.
- **కంబదూరు:** అనంతపురం జిల్లా కంబదూరు మండలం కొత్తపల్లికి చెందిన హనుమంతరాయుడు కుమారుడు జీవన్‌కుమార్ (24) పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో ఉద్యోగం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన జీవన్‌కుమార్... పంటల సాగుకు చేసిన అప్పు తీర్చలేక తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు కళ్లారా చూశాడు. అప్పులు తీర్చలేక కుమిలిపోతున్న తల్లిదండ్రులను చూసి, మనస్తాపానికి గురైన ఆయన సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగాడు. తల్లిదండ్రులు గుర్తించేలోపు మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.



జీవన్‌కుమార్ (ఫైల్)

‘ఆదరణ’ బాధితులూ సంప్రదించండి

అనంతపురం క్రైం: ఆదరణ చిట్ ఫండ్ బాధితులు అనంతపురం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించి సమస్యను విన్నవించాలని ఆ జిల్లా ఎస్పీ అన్బురాజన్ పిలుపునిచ్చారు. అలాగే ‘స్పందన’ (93929 26803) లేదా తన (9440796800) నంబర్లకు కూడా ఫిర్యాదులు పంపాలని కోరారు.

వందేహం గణనాయకం

- ప్రశాంతి నిలయంలో ఘనంగా వినాయకచవితి
- ప్రత్యేక అలంకరణలో మహాసమాధి

ప్రశాంతి నిలయం: ‘ఏకదంతం మహాకాయం, తప్త కాంచనసన్నిభం.. లంబోదరం విశాలాక్షం, వందేహం గణనాయకం’ అంటూ ప్రశాంతి నిలయం మార్మోగింది. వినాయక చవితిని పురస్కరించుకుని సత్యసాయి మహాసమాధి, సాయికుల్వంత్ మందిరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సోమవారం ఉదయం సత్యసాయి సన్నిధిలో కొలువుదీర్చిన వినాయకుడి ప్రతిమలకు రుత్వికులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ప్రశాంతి నిలయం తూర్పు ద్వారం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడికి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు దంపతులు తొలిపూజ నిర్వహించి, వేడుకలు ప్రారంభించారు. మంగళవారం ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత ప్రశాంతి భజన బృందం సభ్యులు గణనాథుడిని కీర్తిస్తూ భక్తి గీతాలు ఆలపించారు. ట్రస్ట్ కార్యాలయంతో పాటు విద్యాసంస్థలు, ఆస్పత్రుల్లో విభిన్న రూపాల్లో విఘ్నాధిపతిని కొలువుదీర్చి పూజలు చేశారు. సత్యసాయి విద్యార్థులు తాము రూపొందించిన గ్రీటింగ్స్‌ను మహాసమాధి చెంత ప్రదర్శించి, భక్తిభావాన్ని చాటుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సత్యసాయి మహాసమాధి




మహాసమాధి చెంత కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం



ప్రశాంతి నిలయం తూర్పు ద్వారం వద్ద గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు దంపతులు



ప్రశాంతి నిలయంలో కొలువుదీర్చిన వినాయక ప్రతిమ



సత్యసాయి సన్నిధిలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ

వీరాకు ‘రాజస్తాన్ రాయల్స్’ పిలుపు



కేహెచ్ వీరారెడ్డి

అనంతపురం: జిల్లాకు చెందిన వర్ధమాన క్రికెటర్ కేహెచ్ వీరారెడ్డికి అరుదైన అవకాశం దక్కింది. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో అత్యుత్తమ ప్రదర్శనతో రాయలసీమ కింగ్స్ జట్టు విజయానికి కారణమైన వీరారెడ్డి.. ఆ టోర్నీలో ఎమర్జింగ్ ప్లేయర్‌గా అవార్డు దక్కించుకున్న విషయం తెలిసిందే. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటింగ్‌తో దూకుడు ప్రదర్శించే వీరారెడ్డి రాష్ట్రంలోనే రెండో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా రికార్డు సైతం నెలకొల్పారు. ఆయన ఆటతీరుపై ప్రశంసలూ వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే తమ జట్టులో ప్రాతినిథ్యం వహించాలంటూ ముంబయి ఇండియన్స్‌తో పాటు రాజస్తాన్ రాయల్స్ నుంచి ఆయనకు పిలుపు అందింది. అయితే నాగపూర్‌లో జరిగే మూడు రోజుల శిక్షణకు హాజరు కావాలన్న రాజస్తాన్ రాయల్స్ పిలుపుపైనే వీరారెడ్డి మక్కువ చూపుతున్నట్లు తెలిసింది. ఈ అవకాశం దక్కితే అనంతపురం ఉమ్మడి జిల్లా నుంచి ఐపీఎల్‌లో అరంగ్రేటం చేసిన తొలి క్రికెటర్‌గా ఆయన ఖ్యాతి గడించనున్నారు. తన 17వ ఏటనే కెరీర్‌లో ఎన్నో మైలు రాళ్లు అధిగమిస్తూ ఉన్నత శ్రేణి క్రికెటర్‌గా ఎదిగిన వీరారెడ్డికి ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

వ్యాధి ఏదైనా.. ఒక్క గొర్రెతోనే మొదలు

- నీలినాలుక, గిట్టపుండ్ల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- పశుశాఖ జేడీ సుబ్రహ్మణ్యం, ఏడీడీఎల్ ఏడీ రామచంద్ర వెల్లడి

అనంతపురం అగ్రికల్చర్: ఏ వ్యాధి ప్రబలినా తొలుత ఒక గొర్రెతోనే మొదలవుతుందని, సకాలంలో దానిని గుర్తించి పశు వైద్యున్ని సంప్రదించడం ద్వారా తగిన జాగ్రత్తలతో వ్యాధి విస్తరించకుండా జీవాలను కాపాడుకోవచ్చని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీడీఎల్) ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర అన్నారు. ఇటీవల కురిసిన తేలికపాటి వర్షాలు, పెరిగిన గాలులు, మారిన వాతావరణ పరిస్థితులకు జీవాల్లో ప్రమాదకరమైన నీలినాలుక వ్యాధి (బ్లూటంగ్), మూతిపుండ్లవ్యాధి, కాలిపుండ్లవ్యాధి (ఫుట్‌రాట్) సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

- నీలి నాలుక (బ్లూటంగ్), మూతి పుండ్ల వ్యాధి సోకితే జ్వరం, మూతి వాపు, పెదవులు దద్దరించడం, నోటి లోపల పుండ్లు, ముక్కులో చీమిడి, కాళ్లు కుంటు, ఒంట్లో నీరు చేరి పారుకోవడం, మేత మేయకపోవడం, ఈసుకుపోవడం (అబార్షన్)తో పాటు 30 శాతం వరకూ మరణాలు సంభవిస్తాయి. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే వ్యాధి సోకిన గొర్రెను వేరు చేసి పశువైద్యున్ని సంప్రదించి సరైన చికిత్స చేయించాలి. సాయంత్రం పూట గొర్రెల మందలో వేపాకు పొగ వేయడం, అపుడప్పుడు బ్లూట్యాక్స్ లేదా టిక్కిల్ మందుతో పిచికారీ చేస్తుండాలి. పొడి ప్రాంతాల్లోనే మేపునకు తీసుకెళ్లాలి. ఈ ఏడాది ఇప్పటి వరకూ బ్లూటంగ్‌కు సంబంధించి 15.18 లక్షల డోసుల వ్యాక్సినేషన్ పూర్తయింది.
- కాలిగిట్టల మధ్య చీము చేరడం, చెడు వాసన రావడం లాంటి లక్షణాలు కనిపిస్తే కాలిపుండ్లవ్యాధిగా గుర్తించాలి. బురద ప్రాంతాల్లో జీవాలను మేపకూడదు. నట్టల నివారణ మందులు తాగించాలి.



గొర్రెల్లో నీలినాలుక వ్యాధి లక్షణాలు



గిట్టపుండ్ల వ్యాధితో నడవలేకపోతున్న గొర్రె

కాపర్లూ ఈ సూచనలు పాటించండి

వ్యాధి వల్ల చనిపోయిన జీవాల కళేబరాలను అమ్మకూడదు, తినకూడదు. ఊరికి దూరంగా గుంత తవ్వి సున్నం చల్లి పాతిపెట్టాలి. కొన్ని జీవాలు చనిపోయే వరకూ ఆరోగ్యంగా ఉన్నట్లుగానే మొండిగా మేత మేస్తూ ఉంటూ ఉన్నఫలంగా మరణిస్తాయి. పై లక్షణాలు కనిపించిన వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తినకూడదు, అమ్మకూడదు. జీవాలకు ఎప్పుడూ పారే నీళ్లు, బోరు నీళ్లు తాగించాలి. నిల్వ ఉన్న నీటిని ఎలాంటి పరిస్థితుల్లోనూ తాపరాదు. జబ్బు బారిన పడిన ఒక గొర్రెను సకాలంలో గుర్తించకపోతే మిగిలిన గొర్రెలకూ విస్తరించే ప్రమాదముంది. జబ్బు బారిన పడి మృతి చెందిన గొర్రె లేదా దాని పేడ, ఇతర అవయవాలు సేకరించి వెంటనే పశువైద్యున్ని సంప్రదించాలి.

పీవీకేకే ఏఓ ఆత్మహత్య

అనంతపురం సిటీ: పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డికి చెందిన పీవీకేకే కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) వడ్డే ధనుష్‌కుమార్ (28) ఆత్మహత్య చేసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బకు చెందిన ఆయన అనంతపురంలోని నేషనల్ పార్క్ సమీపంలో రైలు కింద పడి మంగళవారం మధ్యాహ్నం ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ ధ్రువీకరించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. రైలు చక్రం దూసుకెళ్లడంతో మొండెం నుంచి తల వేరైంది. ఘటనాస్థలాన్ని జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సర్వజనాస్పత్రికి తరలించారు. విషయాన్ని ముదిగుబ్బలోని ఆయన కుటుంబసభ్యులకు చేరవేశామని, వారు ఇచ్చే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

విజిలెన్స్ ఈఈ బాధ్యతల స్వీకరణ



అనంతపురం టౌన్: విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈగా గోపి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈఈగా పని చేసిన యుగంధర్‌ను అన్నమయ్య జిల్లా మదనపల్లికి పనిచేసిన విషయం తెలిసిందే. దీంతో బాధ్యతలు స్వీకరించిన గోపికి అనంతపురం డీఈ రామాంజినేయులరెడ్డి, నాగేంద్ర, మహబుబ్‌పీరా, వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ నాయకుడు బషీర్ పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కర్ణాటక వాసి దుర్మరణం

ఆత్మకూరు: జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో కర్ణాటక వాసి దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా మహదేవపుర గ్రామానికి చెందిన జగదీష్ (25)తో పాటు మరో ముగ్గురు శ్రీసత్యసాయి జిల్లా అమరాపురానికి చెందిన ఐచర్ వాహనం తీసుకుని హైదరాబాద్‌కు బాయిలర్ కోళ్లను తీసుకువచ్చేందుకు బయలుదేరారు. సోమవారం తెల్లవారుజాము 3 గంటలకు ఆత్మకూరు సమీపంలో జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా ఎదురుగా రోడ్డు పక్కనే ఆగి ఉన్న సిమెంట్ లారీ వెనుక భాగాన్ని ఢీకొన్నారు. ఘటనలో ఐచర్ బోల్తాపడింది. జగదీష్ ముఖం ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. కాగా, జగదీష్, అతని సోదరుడు నాగరాజు ఇద్దరూ కోళ్ల బాక్సులను ఎత్తడానికి కూలీలుగా వెళ్లేవారు. జగదీష్‌కు వివాహమై ఓ కుమార్తె కూడా ఉంది. ఘటనపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పిచ్చి కుక్క దాడిలో నలుగురికి గాయాలు

ధర్మవరం రూరల్: మండలంలోని మల్లాకాలువలో మంగళవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. వీధుల్లో సంచరిస్తూ ఎదురుపడిన ఆరేళ్ల చిన్నారి గంగాధర్‌తో పాటు పుల్లమ్మ, అక్కమ్మ, మాధవిని కరిచి గాయపరిచింది. వీరిలో అక్కమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు.

గ్రామీణాభివృద్ధికి ఏపీజీబీ కృషి

- ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ రాకేష్ కశ్యప్

కదిరి అర్బన్: గ్రామీణాభివృద్ధికి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఎంతో కృషి చేస్తోందని ఆ బ్యాంక్ చైర్మన్ రాకేష్ కశ్యప్ అన్నారు. జిల్లాలోనే అత్యధిక ఖాతాలు (రైతులు, స్వయం సహాయక సంఘాల ఖాతాలు) ఉన్న బ్యాంక్ తమదేనని పేర్కొన్నారు. బ్యాంక్ నూతనంగా తీసుకువచ్చిన ‘రుణ విస్తరణ’ కార్యక్రమాన్ని మంగళవారం కదిరిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆయన ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలోని 58 బ్రాంచ్‌లకు తోడుగా మరో 130 ఔట్‌లెట్స్ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. వీటి ద్వారా బ్యాంక్ సేవలను ఖాతాదారుల గుమ్మం వద్దకే చేర్చినట్లు వివరించారు. మొత్తం రూ.4,850 కోట్లతో అధిక వ్యాపార వాటాను కలిగి ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇందులో రూ.3,013 కోట్ల రుణాలు ఉన్నాయన్నారు. వ్యాపార, వ్యక్తిగత, వ్యవసాయేతర రంగాల అభివృద్ధికి రుణ విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ పథకంలో భాగంగా వ్యవసాయ రుణాలతో పాటు అనుబంధ రంగాల (వ్యాపార, వ్యక్తిగత)కు రుణాలు మంజూరు చేసి అదనపు ఆదాయం సమకూరుస్తున్నట్లు పేర్కొన్నారు. కదిరి, పుట్టపర్తిలో లోన్ హబ్‌లు (సరళ రుణ కేంద్రాలు) ఏర్పాటు చేశామన్నారు. వీటిలో రూ.10 లక్షలు పైబడి రుణ మంజూరు మరింత సులువుగా ఉంటుందన్నారు. డిజిటలైజేషన్ సేవల్లో కూడా తమ బ్యాంకు అన్ని బ్యాంకుల కంటే ముందంజలో ఉందన్నారు. అలాగే డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇచ్చే ఏకైక బ్యాంక్ తమదే అన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ రమణకుమార్, ఏపీజీబీ రీజనల్ మేనేజర్ రవీంద్రారెడ్డి, చీఫ్ మేనేజర్ నవీన్‌కుమార్‌తో పాటు పలువురు మేనేజర్‌లు, ఖాతాదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేష్‌కశ్యప్

పురుగుల మందు తాగి వివాహిత మృతి

ఎన్పీకుంట: కడుపు నొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎన్పీకుంట మండలం యాదలవాండ్లపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహారెడ్డి, పుష్పావతి(29) దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న పుష్పావతికి కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేని ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగింది. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న పుష్పావతిని గమనించి వెంటనే కదిరిలోని సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, పుష్పావతి మృతదేహాన్ని కదిరి ఆస్పత్రిలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి పరిశీలించి, ఘటనపై ఆరా తీశారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఎంపీపీ ఈటె రాము, జయచంద్రనాయుడు తదితరులు ఉన్నారు.



మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి

కసాపురం ఆలయంలో చోరీ


- చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ చేతి వాటం
- రెండు నిమిషాల వ్యవధిలో 8 సార్లు హుండీలో నగదు అపహరణ

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కృష్ణారెడ్డి చేతి వాటం ప్రదర్శించారు. ఆలయ ఆస్తులను పరిరక్షించాల్సిన ఆయనే స్వయంగా హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను అపహరిస్తూ నిఘా నేత్రాలకు పట్టుబడ్డాడు. వివరాలు.. పవన్ సెక్యూరిటీ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో ఆలయంలో సెక్యూరిటీ సిబ్బందితో కలుపుకుని మొత్తం 70 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఏజెన్సీ నిర్వాహకుడు, కాంట్రాక్టర్ అయిన కృష్ణారెడ్డి దాదాపు 20 ఏళ్లుగా ఆలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ నెల 17న ఆదివారం వేకువజామున 4 గంటలకు అర్చకులు స్వామివారికి అభిషేకం చేస్తుండగా గర్భగుడి ఎదురుగా ఉన్న హుండీలోకి చెయ్యి పెట్టి 2 నిమిషాల వ్యవధిలో 8 సార్లు అందులోని నగదును తీసి తన ప్యాంటు జేబులో పెట్టుకున్నాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. అదే సమయంలో మరో వ్యక్తి కూడా చోరీ విషయాన్ని గమనించాడు.

నిజాన్ని బయటపెట్టిన అజ్ఞాత వ్యక్తి

ఉదయం 10గంటలకు విధులకు హాజరైన ఆలయ అధికారులు ముందుగా సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించాలి. అయితే ఇందుకు విరుద్ధంగా ఎవరి పనుల్లో వారు నిమగ్నం కావడంతో సెక్యూరిటీ ఆఫీసర్ చేసిన చోరీ విషయాన్ని అజ్ఞాత వాసి నెమ్మదిగా బయటపెట్టాడు. విషయం తెలుసుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి వెంటనే స్పందించారు. ఘటనపై ఆరా తీస్తూ అధికారులను నిలదీశారు. దీంతో ఆలయ పాలక మండలి సభ్యులతో కలసి అధికారులు సోమవారం ఉదయం నాటి సీసీ ఫుటేజీలను పరిశీలించడంతో కృష్ణారెడ్డి బాగోతం వెలుగు చూసింది. వెంటనే అతన్ని విధుల నుంచి తప్పిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై లోతైన దర్యాప్తు చేపడతామని ఎస్‌ఐ గోపాలుడు పేర్కొన్నారు.

హోరాహోరీగా చాకిడి బండ్ల పోటీలు



ఎండ్ల బండ్ల పోటీల్లో సత్తా చాటుతున్న ఎద్దులు



చాకిడి బండితో పరుగెడుతున్న కుర్రదూడలు



అంబరీష్‌కు మొదటి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

పుట్టపర్తి అర్బన్: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పుట్టపర్తి మండలం గాజులపల్లిలో మంగళవారం నిర్వహించిన చాకిడి బండ్ల (ద్విచక్ర వాహనాల చక్రాలతో చేసిన బండ్లు) పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీల కోసం తమిళనాడు ప్రత్యేకంగా 38 చాకిడి బండ్లను తీసుకువచ్చారు. వివిధ గ్రామాలకు చెందిన 38 జతల కుర్రదూడలను పోటీలకు రైతులు తీసుకువచ్చారు. ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ రంగన్న, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ గంగాద్రి, కో-ఆప్షన్ సభ్యుడు మాబూసాహెబ్, కొట్లపల్లి సర్పంచ్ కుల్లాయిరెడ్డి, వైస్ సర్పంచ్ వెంకటేషు, నాయకులు బాలు, వెంకటరెడ్డి, కృష్ణానాయక్, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. 150 మీటర్ల దూరాన్ని నిర్ణయించి ఒక్కోవిడతో రెండేసి ఎడ్ల బండ్లను పరుగెత్తించారు. వరుసగా తొలి ఐదు స్థానాలను దక్కించుకున్న బుగ్గపల్లి అంబరీష్, కొత్తచెరువు సూర్య, నిడిమామిడి మురళి, నిడిమామిడి నాగరాజు, బుక్కపట్నం శ్రీరాములను అభినందిస్తూ నిర్వాహకులు నగదు పురస్కారాలతో సత్కరించారు. పోటీలు చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ దాదాపీర్ గట్టిబందోబస్తు చేపట్టారు. ప్రేమ్‌సాయి, అనిల్, తిరుమలేష్, బాలాజీ నాయక్, బన్నీ తదితరులు పర్యవేక్షించారు.